బక్రీద్‌కు పటిష్ట బందోబస్తు

- పశువులను అక్రమ రవాణా చేస్తే సమాచారం అందించాలి : ఎస్పీ చందనా దీప్తి

ఈద్గావద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ చందనాదీప్తి

నీలగిరి, జూన్ 15 : బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లాలో శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్పీ చందనా దీప్తి తెలిపారు. శనివారం పట్టణ కేంద్రంలోని ఈద్గాను సందర్శించి ఏర్పాట్లును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గోవులు, లేగదూడలను అక్రమంగా రవాణా చేయకుండా జిల్లా వ్యాప్తంగా చెక్ పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పశువులను అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏవరైనా పశువులను అక్రమంగా రవాణా చేస్తున్నట్లు తెలిస్తే పోలీస్ అధికారులకు, డయల్ 100కు సమాచారం అందించాలని, అలా కాకుండా వారిపై భౌతిక దాడులు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

టెన్త్‌లో ప్రతిభ కనబర్చిన వారికి పూర్వ విద్యార్థుల ప్రోత్సాహం

విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

చిట్యాల, జూన్ 15 : మండలంలోని పెద్ద కాపర్తి జడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతిలో ప్రతిభ కనబర్చిన వారికి శనివారం 1985–86 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ప్రోత్సాహకాలు అందించారు. 9.0 జీపీఏ సాధించిన నీల కంఠం ఉమామహేశ్వరి, 8.8 జీపీఏ సాధించిన ఏర్పుల వాసవికి రూ. 5వేల చొప్పున అందించారు. పూర్వ విద్యార్థి విద్యాసాగర్ కూతురు వల్లందాసు నిషిత ప్రత్యేకంగా మరో రూ. 5వేలను అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మజ, మాజీ సర్పంచ్ మర్రి జలంధర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ నూతి సత్యశ్రీ, ముద్దసాని వెంకటరమణ, మంజుల, నరేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటుపుస్తకాలు

హాలియ: నోటుపుస్తకాలు పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు

హాలియా, జూన్ 15 : హాలియా గ్రేటర్ వాసవీ క్లబ్, వనితా క్లబ్ ఆధ్వర్యంలో శనివారం పేద విద్యార్థులకు బ్యాగులు, నోటుపుస్తకాలు, వీధి వ్యాపారులకు గొడుగులు, శివాలయానికి 2వేల లీటర్ల వాటర్‌ట్యాంక్‌ను అందించారు. అనంతరం ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఐఈసీ అధికారి నాలం అండాలు, మాదవీ రవీందర్, రీజియన్‌న చైర్మన్ కొండూరు శోభన్‌బాబు, మారం అనిత, కొత్త మాస్ శ్రీనివాస్, బచ్చు సతీశ్, గందె మహేశ్, నీలంటి శ్రీధర్, గట్టు వెంకటేశ్వర్లు, సముద్రాల అరవింద్ పాల్గొన్నారు.

చింతపల్లి ప్రాథమిక పాఠశాలలో..

మాల్ : చింతపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం హైదరాబాద్‌లోని నేను సైతం సేవా సంస్థ ఆధ్వర్యంలో కామేశ్, ఫణికుమారి దంపతులు రూ.20 వేల విలువైన నోటుపుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కొండూరు ఆంజనేయులు, సంస్థ సభ్యులు ఆర్.లక్ష్మి, రాజేశ్వరి, లక్ష్మీబాయి, గోపాల కృష్ణ, సైదులు, అలివేలమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు శాలిగౌరారం ఆయకట్టుకు నీటి విడుదల

శాలిగౌరారం ప్రాజెక్టు షట్టర్లను పరిశీలిస్తున్న డీఈ సత్యనారాయణ

శాలిగౌరారం, జూన్ 15 : శాలిగౌరారం ప్రాజెక్ట్ ఆయకట్టుకు ఆదివారం నీటిని విడుదల చేయనున్నట్లు నీటిపారుదల శాఖ డీఈ సత్యనారాయణ తెలిపారు. శనివారం ఆయన ప్రాజెక్టులో నీటి మట్టాన్ని, షట్టర్లను, కాల్వలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేసేందుకు భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ రానున్నట్లు చెప్పారు. ఆయన వెంట ఏఈ రాములు, రైతు సంఘం మండల ప్రతినిధి చామల వెంకటరమణారెడ్డి, పడాల రమేశ్, లొడంగి మహేశ్ ఉన్నారు.

ఈద్గా వద్ద ఏర్పాట్ల పరిశీలన


ఈద్గా వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ రాహత్ అలీ

చందంపేట(దేవరకొండ), జూన్ 15 : బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించేందుకు వీలుగా దేవరకొండలోని ఈద్గా వద్ద జరుగుతున్న ఏర్పాట్లను శనివారం మున్సిపల్ వైస్ చైర్మన్ మహ్మద్ రాహత్ అలీ, ఈద్గా కమిటీ అధ్యక్షుడు సయ్యద్ అజీముద్దీన్‌తో కలిసి పరిశీలించారు. ఈద్గా వద్ద పార్కింగ్, నీటి సదుపాయాలను పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలిచ్చారు. వారి వెంట ఈద్గా కమిటీ ప్రధాన కార్యదర్శి ఇలియాస్‌పటేల్, సయ్యద్ దస్తగిరి, మున్సిపల్ ఇన్‌స్పెక్టర్ జాఫర్, మహ్మద్ ఫసి పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

REAL ESTATE

★హైదరాబాద్, సంగారెడ్డి, రంగారెడ్డి, కోదాడ పరిసర ప్రాంతాలలో స్థలాలు, పొలాలు, ప్లాట్స్ అమ్మాలన్నా, కొనాలన్నా & డెవలప్ చేసి ఇవ్వాలన్నా సంప్ర: 9133915599, 7995912999.
NT-16-All

WANTED

★Corel Draw Photo Shop Designer M/F Sal: 20K, Office Clerk Female Calculation & Receptionist Sal: 15K, 2 No's Marketing Executives (Male) Sal: 18K. Near RTC X-Road, Pillar No. 34 & 35. 9849003504.
NT-97639-All

గుమస్తాలు, అకౌంటెట్లు కావలెను

రాంలక్ష్మణ్ పారాబాయిల్డ్ పానగల్ బైపాస్, నల్లగొండ మిల్లులో పనిచేయుటకు అర్హులైన గుమస్తాలు, అకౌంటెంట్లు (పురుషులు, స్త్రీలు) కావలెను. ఆసక్తి కలిగినవారు సంప్ర॥9912457999, 9848039579, 7842621631.
NLG-

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-

ఖాజీరామారానికి కరెంటొచ్చింది

- స్తంభాలపై లైన్లను క్లియర్ చేసిన విద్యుత్‌శాఖ సిబ్బంది
- పజ్జూర్ నుంచి వేసిన లైన్ ప్రారంభిస్తేనే సమస్యకు శాశ్వత పరిష్కారం

ఖాజీరామారంలో కరెంట్ లైన్‌ను సరి చేస్తున్న విద్యుత్‌శాఖ సిబ్బంది

నల్లగొండ, జూన్ 15 : రెండు నెలలుగా అంధకారంలో ఉన్న నల్లగొండ మండలం ఖాజీరామారం గ్రామానికి కరెంట్ వచ్చింది. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో నెలకొన్న సమస్యపై శనివారం నమస్తే తెలంగాణలో 'కరెంట్ పోతే వచ్చేదెప్పుడో' శీర్షికన ప్రచురితమైన కథనానికి విద్యుత్ అధికారులు స్పందించారు. శనివారం ఉదయం పది గంటలకే విద్యుత్ లైన్లు క్లియర్ చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు, దాంతో ఖాజీరామారంలోని వీధుల్లో లైట్లు వెలిగాయి. దాంతో పాటు సర్వీస్ వైర్ సమస్యతో పది రోజులుగా చీకట్లో ఉంటున్న లక్ష్మమ్మ ఇంట్లోకి కూడ కరెంట్ వచ్చింది. దాంతో లక్ష్మమ్మ నమస్తే తెలంగాణకు కృతజ్ఞతలు తెలిపింది. అయితే 8 నెలల క్రితం పజ్జూరు నుంచి వేసిన కొత్త లైన్ ప్రారంభిస్తేనే తిప్పర్తి మండలంలోని కొరివేని గూడెం, తానెదార్ పల్లి, నల్లగొండ మున్సిపాలిటీలోని శేషమ్మ గూడెం, ఎస్టీ కాలనీ, ఖాజీ రామారం గ్రామాల్లో విద్యుత్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని గ్రామస్తులు చెబుతున్నారు. దానిని వెంటనే ప్రారంభించాలని కోరుతున్నారు. సంబంధిత కాంట్రాక్టర్‌తో పాటు అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ సమస్య వచ్చిందని, దానిని సరి చేయాలని కోరుతున్నారు.

కాంగ్రెస్ మేనిఫెస్టోను అమలు చేయాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు కందాల ప్రమీల

సమావేశంలో మాట్లాడుతున్న కందాల ప్రమీల

నకిరేకల్, జూన్ 15 : అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన మేనిఫెస్టోలోని పథకాల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తప్ప మిగిలిన పథకాలను అమలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నదని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు కందాల ప్రమీల డిమాండ్ చేశారు. నకిరేకల్‌లోని పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన మండల టౌన్ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. మేనిఫెస్టోలో ప్రకటించినట్లుగానే ప్రతి వ్యవసాయ కూలీ కుటుంబానికి రూ.12వేలు ఇవ్వాలని, కౌలు రైతులకు వానకాలం నుంచే రైతు భరోసా అమలు చేయాలని, వరి ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధిహామీ కూలీల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు. మర్రి వెంకటయ్య, సాగుంట్ల నరసింహ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి రాచకొండ వెంకట్‌గౌడ్, నాయకులు వంటిపాక వెంకటేశ్వర్లు, చెన్నబోయిన నాగమణి, వంటిపాక కృష్ణ, యర్కలి అంజయ్య, గింజల లక్ష్మి, బొడ్డుపల్లి లక్ష్మి, నరసయ్య, స్వరూప, అక్కెనపల్లి సైదులు, జిల్లా ఉపేందర్, ఇందిర పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల ఫీజు దోపిడీని అరికట్టాలి

- బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అశోక్

ఆర్డీఓ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందిస్తున్న బీసీ యువజన సంఘం నాయకులు

మిర్యాలగూడ, జూన్ 15: పట్టణంలో పలు ప్రైవేటు పాఠశాలలు అధిక ఫీజులు వసూలు చేయడంతో పాటు పాఠ్య పుస్తకాలు, యూనిఫాం పేరుతో తల్లిదండ్రుల వద్ద నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని, వాటిపై చర్యలు తీసుకోవాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆర్డీఓ శ్రీనివాస్‌రావుకు వినతిపత్రం అందించారు. అనంతరం ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా వ్యవహరిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రతి ప్రైవేట్ పాఠశాలలో ఐదుగురు పేద విద్యార్థులకు ఉచితంగా విద్యను అందించాల్సి ఉన్నా అది అమలు చేయడం లేదన్నారు. వినతిపత్రం అందించిన వారిలో సంఘం నాయకులు చిలుకల మురళీయాదవ్, పాలిశెట్టి అజయ్‌కుమార్, గంగాధర్, సిద్ధం రాజు, ఉపేందర్, నరేశ్, నవీన్ ఉన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి

రామగిరి, జూన్ 15 : కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేసేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి డిమాండ్ చేశారు. నల్లగొండలోని దొడ్డి కొమురయ్య భవనంలో శనివారం నిర్వహించిన సంఘం జిల్లాస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి ఆరు నెలలైనా.. కేవలం సమీక్షలు చేయడానికే సరిపోయిందన్నారు. కార్మిక శాఖలో అనేక పోస్టులు ఖాళీగా ఉండడం వల్ల సంక్షేమ పథకాలు అమలు చేయలేకపోతున్నారని చెప్పారు. అంగన్‌వాడీ, ఆశాకార్యకర్తల కనీస వేతనం రూ.18000 ఇస్తామని, హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిందని, కానీ నేటికీ అమలు చేయలేదని పేర్కొన్నారు. అంగన్‌వాడీలకు రిటైర్మెంట్ బెనిఫిట్ రూ. 2లక్షలు ప్రకటించాలని, మధ్యాహ్న భోజన కార్మికులకు, వీఓఏలకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు డబ్బికార్ మల్లేశ్ పాల్గొన్నారు.

కులగణన హామీని నెరవేర్చాలి : పిల్లి రాజు యాదవ్

నిడమనూరు, జూన్ 15 : కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన చేపట్టి స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం నాగార్జునసాగర్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి పిల్లి రాజు యాదవ్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు కులగణన చేపట్టకుండా సీఎం రేవంత్‌రెడ్డి తప్పించుకునేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో సమగ్ర కుటుంబ సర్వే ఒక్క రోజులోనే చేపట్టగా.. రాష్ట్ర జనాభాలో సగం ఉన్న బీసీల జణగణన లెక్కించేందుకు నెలరోజుల సమయం సరిపోదా అని ప్రశ్నించారు. తక్షణమే బీసీల కుల గణన చేపట్టాలని కోరారు.

మిషన్ భగీరథ సర్వేను సమగ్రంగా చేపట్టాలి

- ఎంపీడీఓ లక్ష్మి

చందంపేట, జూన్ 15 : మిషన్ భగీరథ నీరు ప్రతి ఇంటికి చేరుతున్నదా లేదా తెలుసుకునేందుకు చేపడుతున్న సర్వేను సమగ్రంగా చేపట్టాలని ఎంపీడీఓ లక్ష్మి అధికారులు, సిబ్బందికి సూచించారు. శనివారం తన చాంబర్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు ఇంటింటికీ వెళ్లి మిషన్ భగీరథ నల్లా కనెక్షన్ ఉన్న వారిని గుర్తించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఈ నెల 19లోగా వివరాలను నమోదు చేసి నివేదిక అందించాలని ఆదేశించారు.

17 వరకు రేషన్ బియ్యం పంపిణీ

చందంపేట(దేవరకొండ), జూన్ 15 : దేవరకొండ రెవెన్యూ డివిజన్ పరిధిలోని రేషన్ డీలర్లు ఈ నెల 17 వరకు కార్డుదారులకు బియ్యాన్ని పంపిణీ చేయాలని దేవరకొండ పౌర సరఫరాల శాఖ అధికారి హనుమంతు శ్రీనివాస్‌గౌడ్ శనివారం ఒక ప్రకటనలో సూచించారు. ప్రతి నెల 15 వరకు బియ్యం పంపిణీ చేస్తున్నారని, జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మరో రెండు రోజులు పొడిగించినట్లు ఆయన తెలిపారు. రేషన్ షాపులను సకాలంలో తెరిచి కార్డుదారులకు బియ్యం అందించాలని ఆదేశించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మిర్యాలగూడ, జూన్ 15: మిర్యాలగూడ పట్టణం పరిధిలోని శాంతినగర్, సంతోష్‌నగర్, కృష్ణకాలనీ ప్రాంతాలకు ఆదివారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ ఎస్.వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని సబ్‌స్టేషన్ నుంచి వచ్చే 11కేవీ శాంతినగర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ తీగలకు తగులుతున్న చెట్ల కొమ్మల నరికివేత చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

శిఖం ఆక్రమణల పరిశీలన

చెరువు శిఖం ఆక్రమణలను పరిశీలిస్తున్న తాసీల్దార్ జంగాల కృష్ణయ్య

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

నిడమనూరు, జూన్ 15 : మండల కేంద్రంలోని నల్లచౌట చెరువు శిఖం ఆక్రమణలను శనివారం అధికారులు పరిశీలించారు. ఈ విషయమై శుక్రవారం నమస్తే తెలంగాణలో 'చెరువు శిఖంలో ఆగని ఆక్రమణలు' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించిన తాసీల్దార్ జంగాల కృష్ణయ్య, నీటిపారుదల శాఖ ఏఈ ప్రవీణ్‌రాజుతో కలిసి నల్లచౌట చెరువు శిఖం భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా తాసీల్దార్ మాట్లాడుతూ చెరువు శిఖం భూములను ఆక్రమించుకున్న వారిని గుర్తించి నోటీసులు జారీ చేయాలని ఏఈ ప్రవీణ్ రాజుకు సూచించారు. సమగ్ర విచారణ చేపట్టి నివేదికను సమర్పించాలన్నారు. ఎఫ్‌టీఎల్ హద్దు ఏర్పాటుకు పూర్తిస్థాయి సర్వే చేపట్టడంతో పాటు ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. వారి వెంట రెవెన్యూ, నీటిపారుదల శాఖ సిబ్బంది ఉన్నారు.

ఆక్రమణ దారులపై కేసు నమోదు చేయాలని వినతి

నల్లచౌట చెరువు శిఖం ఆక్రమణలపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై కేసులు నమోదు చేయాలని కోరుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రాక్షి నర్సింహ్మా శనివారం అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్‌కు వినతి పత్రం అందించారు. చెరువు శిఖం భూములు ఆక్రమణకు గురవుతున్నా నిర్లక్ష్యం వహిస్తున్న నీటిపారుదల శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాతనబోయిన వెంకటయ్య ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి

- ఎమ్మెల్యే బీఎల్ఆర్

విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందిస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

మిర్యాలగూడ, జూన్ 15 : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి కోరారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని బకల్‌వాడీ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు మధ్యాహ్న భోజనం, నోట్‌బుక్స్, పాఠ్య పుస్తకాలు, యూనిఫాంను ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు. తల్లిదండ్రులు వీటిని సద్వినియోగం చేసుకొని తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి బాగా చదివించాలని సూచించారు. పాఠశాలలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని, మరుగుదొడ్లకు మరమ్మతులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విజేత కళాశాలలో జాబ్‌మేళా


ఉద్యోగాలకు ఎంపికైన వారికి నియామక పత్రాలు అందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ ధనుంజయ్

మిర్యాలగూడ, జూన్ 15 : గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకే విజేత డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ తెడ్ల ధనుంజయ్ అన్నారు. శనివారం కళాశాలలో ఎంఎస్ఎన్ ల్యాబొరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్ మేళాకు ఇంటర్మీడియట్ విద్యార్హతతో 25 మంది, డిగ్రీ విద్యార్హతతో 16 మంది హాజరయ్యారని, 33 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికకాగా వారికి నియామక పత్రాలు అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు కె.మధు, పి.స్వామినాయక్, డి.బాలాజీ పాల్గొన్నారు.

దర్వేశిపురం రేణుకా ఎల్లమ్మ బ్రహ్మోత్సవాలు షురూ..

- నేడు అమ్మవారి కల్యాణం

నల్లగొండ సిటీ, జూన్ 15 : కనగల్ మండలం దర్వేశిపురంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయ బ్రహ్మోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఉదయం మంగళవాయిద్యాలు, సుప్రభాత సేవ, నివేదిత జాతర, పంచగవ్య రక్షక బంధం, అఖండ దీపారాధన నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఎదుర్కోళ్ల మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదివారం నిర్వహించే అమ్మవారి కల్యాణోత్సవంలో మంత్రి కోమటిరెడ్డి పాల్గొననున్నట్లు అధికారులు తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు వచ్చే భక్తులకు అసౌకర్యం కలుగకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు.

ఆలయ చైర్మన్‌కు అందని ఆహ్వానం

దర్వేశిపురం రేణుకా ఎల్లమ్మ ఆలయ బ్రహ్మోత్సవాలు రాజకీయ రంగును పులుముకుంటున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆలయ చైర్మన్‌గా ఎన్నికైన నరసింహారెడ్డి పదవీకాలం ఇంకా మూడు నెలలు ఉన్నప్పటికీ ప్రస్తుత ఉత్సవాలకు ఆయనకు ఆహ్వానం అందించలేదు. అధికార పార్టీ నాయకుల ఒత్తిడి మేరకే ఆలయ అధికారులు చైర్మన్‌ను ఆహ్వానించలేదని తెలిసింది. తనకు ఆహ్వానం అందక పోవడంతో చైర్మన్ బ్రహ్మోత్సవాలకు దూరంగా ఉన్నట్లు సమాచారం

ప్రాణం తీసిన రైస్‌పుల్లింగ్

- డబ్బుల కోసం బావమరిది హత్య
- బావతోపాటు ఆరుగురి అరెస్టు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ చందనాదీప్తి

నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ చందనాదీప్తి

నీలగిరి, జూన్ 15 : మూఢ నమ్మకాల ఉచ్చులో పడి సులభంగా డబ్బులు సంపాదించాలనే ప్రయత్నంలో డబ్బులు పోగొట్టుకున్న వ్యక్తి.. చివరకు సొంత బామ్మర్దినే హత్య చేయించగా ఈ కేసును కనగల్ పోలీసులు చేధించి నిందితులను అరెస్ట్ చేశారు. కేసుకు సంబంధించిన వివరాలను ఎస్పీ చందనాదీప్తి శనివారం విలేకరుల సమావేశంలో వివరించారు. యాదగిరిగుట్టకు చెందిన సముద్రాల కృష్ణ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూనే.. బెంగుళూరు చెందిన వెంకటేశ్‌తో కలిసి రైస్‌పులింగ్(మ్యాజిక్ పాట్)ను విక్రయించేవాడు. ఈ మ్యాజిక్ పాట్ ఉన్న వారికి ఆకస్మికంగా ధనలాభం కలుగుతుందని ఇతరులను నమ్మించి వాటిని విక్రయించే వారు. కృష్ణ బావ నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం ఇందుర్తి గ్రామానికి చెందిన నాగబండి మధు హైదరాబాద్‌లోని హయత్‌నగర్‌లో ఉంటూ రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. రైస్‌పులింగ్ గురించి తన బావకు వివరించిన కృష్ణ సదరు మ్యాజిక్ పాట్‌ను ఇప్పిస్తానని చెప్పి అందుకోసం రూ1.50 కోట్లను మధు నుంచి బెంగుళూరుకు చెందిన వ్యక్తికి ఇప్పించాడు. డబ్బులు ఇచ్చి ఆరు నెలలు గడిచినా మ్యాజిక్ పాట్ ఇవ్వకపోవడంతో తన డబ్బులు తిరిగి ఇవ్వాలని బావమరిది కృష్ణను అడిగాడు. దానికి కృష్ణ నిరాకరించడంతో మధు తీవ్ర ఆగ్రహానికి లోనయ్యాడు. తన డబ్బులు పోవడానికి కారణమైన కృష్ణపై పగ పెంచుకున్నాడు. మధు స్నేహితుడు శ్రీనివాసరావును కూడా ఇలాగే మ్యాజిక్‌పాట్ ఇప్పిస్తానని బెంగళూరుకు చెందిన వెంకటేశ్ మోసం చేశాడు. దాంతో ఇద్దరూ కలిసి తమను మోసం చేసిన కృష్ణతో పాటు బెంగళూరుకు చెందిన వెంకటేశ్‌ను చంపాలని నిర్ణయించుకున్నారు. కృష్ణకు ఇంకా వివాహం కాక పోవడం, అతడి తల్లిదండ్రులు కూడా లేక పోవడంతో మొదటగా అతడిని చంపితే ఉన్న ఆస్తినంతా తీసుకోవచ్చని మధు భావించాడు. కృష్ణ నోట్లో సైనైడ్ పోసి చంపి తర్వాత ఆత్మహత్యగా చిత్రీకరించాలని ప్లాన్ చేశాడు. శ్రీనివాసరావుకు పరిచయం ఉన్న కాకినాడకు చెందిన ఎల్లా కృష్ణచైతన్య, సలాది మణికంఠ సాయంతో ఆన్‌లైన్ ద్వారా పెప్పర్ స్ప్రేను, గుంటూరుకు చెందిన ఎస్‌కే ఉస్మాన్ ద్వారా సైనైడ్ తెప్పించారు. ఈ ముగ్గురు మే 9న విజయవాడకు వచ్చి శ్రీనివాసరావు, మధులను కలిశారు. అదే రోజు యాదగిరిగుట్టలోని కృష్ణ ఇంటికి వచ్చారు. అతడి ఇంట్లో పని మనిషి ఉండడంతో కృష్ణను హత్య చేయడం సాధ్యం కాలేదు. మే 16న కాకినాడ నుంచి కారు కిరాయికి తీసుకొని నలుగురు (శ్రీనివాసరావు, కృష్ణచైతన్య, మణికంఠ,హరికిరణ్) యాదగిరిగుట్టకు వచ్చారు. మధును తీసుకొని కృష్ణ ఇంటికి వెళ్లిన వీరు అతడిని మాటల్లో పెట్టి ఒక్కసారిగా పెప్పర్ స్ప్రేను కొట్టారు. అతను తేరుకొనేలోపే గొంతు నులిమి, నోట్లో సైనైడ్ పోశారు. దాని ప్రభావంతో కొద్దిసేపటికే కృష్ణ మృతి చెందాడు. దాంతో వారు కృష్ణ ఇంట్లో ఉన్న 7.4 తులాల బంగారు ఆభరణాలు, కేజీ వెండి ఆభరణాలు, రూ. 45వేలు, ప్లాట్లకు సంబంధించిన దస్తావేజులు, మొబైల్ తీసుకొని ఇంట్లో ఉన్న సీసీ కెమెరాలు, డీవీఆర్‌లను సైతం తీసుకున్నారు.

రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు యత్నం

తాము హత్య చేసిన కృష్ణ రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు చిత్రీకరించాలని నిందితులు భావించారు. కృష్ణ మృతదేహన్ని అతడి కారులోనే ఉంచి బయల్దేరారు. అయితే అనువైన ప్రాంతం దొరక్క పోవడంతో మృతదేహన్ని సాగర్‌లో పడేయాలని భావించి నల్లగొండ వరకు వచ్చారు. మాడ్గులపల్లి వద్ద టోల్‌గేట్ ఉండడంతో పట్టుబడే ప్రమాదం ఉందని భావించి చివరకు కనగల్ బ్రిడ్జి మీది నుంచి మృతదేహాన్ని కింద పడేశారు. అక్కడి నుంచి వాడపల్లికి చేరుకొని మృతుడి ఇంట్లోంచి తీసుకొచ్చిన డీవీఆర్, మానిటర్, సెల్‌ఫోన్, పెప్పర్ స్ప్రేబాటిల్‌ను కృష్ణానదిలో పారేశారు.

ఆధార్ కార్డు ఆధారంగా మృతుడి వివరాలు గుర్తింపు

మే 19న కనగల్ బ్రిడ్జి కింద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించడంతో పోలీసులు అనుమానాస్పద వ్యక్తిగా కేసుగా నమోదు చేశారు. మృతుడి జేబులో లభించిన ఆధార్ కార్డు ద్వారా వివరాలు సేకరించారు. మృతదేహం పోస్టుమార్టమ్ రిపోర్ట్‌లో హత్యగా తేలడంతో కనగల్ పోలీసులు కేసు దర్యాప్తు చేసి నిందితులను గుర్తించారు.

హైదరాబాద్‌కు వెళ్తుండగా పట్టివేత

సముద్రా కృష్ణ హత్య కేసులో నిందితులపై ప్రాథమిక నిర్ధారణకు వచ్చిన పోలీసులు అత్యాధునిక టెక్నాలజీ ద్వారా వారిని పట్టుకున్నారు. మృతుడి కారుతో పాటు మరో కారులో నిందితులు హైదరాబాద్‌కు వెళ్తుండగా పోలీసులు కృష్ణ చైతన్య, హరికిరణ్‌తో పాటు నాగబండి మధు, శ్రీనివాస్‌రావును అదుపులోకి తీసుకొన్నారు. అనంతరం వారిని రిమాండ్‌కు తరలించారు. అనుమానాస్పదంగా వ్యక్తి మృతి కేసును సవాల్‌గా తీసుకొని నిందితులను పట్టుకున్న నల్లగొండ డీఎస్పీ కొలను శివరాంరెడ్డి, చండూర్ సీఐ వెంకటయ్య, కనగల్ ఎస్ఐ రామకృష్ణ, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.